కథ

నాకు ఆ జంటను చూస్తుంటే, చాలా విచిత్రంగా అనిపిస్తుంది. రోజూ సాయంత్రం నేను వాకింగ్‌కు వెళ్ళే సమయం-వాళ్ళు ఆ చిన్న తోటలో ఓ పక్కగా చెట్టుక్రింద గట్టుమీద కూర్చొని కబుర్లు చెప్పుకుండే సమయం.

# కమ్మని నిశ్శబ్దం

అతడు సామాన్య అందగాడే అయినా ఆ అమ్మాయి మాత్రం మరల మరల చూడాలనిపించేలా వుంటుంది. ఎర్రగా, సన్నగా, పత్తైన తలకట్టుతో వుంటుంది. కోలమొఖం. పెద్ద పెద్ద కళ్ళు. ఎప్పుడు ఎర్రని పెదాల వెనగ్గా అప్పుడే విచ్చుకుంటున్న మల్లెల్లా పళ్ళన్నీ కనబడేలా అందమైన నవ్వు.

ఆ దారిన పోతూ కొద్దిక్షణాలు ఆ మొఖాన్ని చూడటానికి నా కళ్ళు ఎంతగానో ఆతృత పడుతుంటాయి. ఏరోజైనా ఆ మొఖం కనబడకపోతే తెలియని నిరాశ...ఏదో పోగొట్టుకున్నంత దిగులు.

ఆఫీసు నుంచి రాగానే అమ్మ యిచ్చిన కాఫీ త్రాగి, ఆ రోజు పేపరు అటూ యిటూ తిప్పి అరు గంటలవ్వగానే మామూలుగా విహారానికి బయిల్దేరాను.

నాలో రెండు రోజుల క్రితం-మొట్టమొదటిసారిగా ఓ వింత కోరికపుట్టింది. ఆ అమ్మాయి ఇల్లెక్కడో తెలుసుకోవాలని..ఆ అమ్మాయి పూర్వాపరాలు విచారించాలనీను!

ఇక్కడ కనబడని రోజున ఇంటి దగ్గరైనా ఆ మొఖాన్ని ఒక్కసారి చూచి రావాలనే కాంక్ష మొదటిదైతే....ఈ పార్కులమ్మడిపడి తిరిగే ఆ అమ్మాయి అంతరంగాన్ని తెలుసుకోవాలనేది రెండోది.

ఇప్పటికే నిలువులోతులో ప్రేమలో అతగాడితో కూరుకుపోయిన ఆ అమ్మాయిది నిజమైన ప్రేమా..లేక డబ్బు సంపాదనలో ఒక భాగమా?- రెండోదే నిజమయితే తను ఆ అమ్మాయితో ఆనందాన్ని అనుభవించేటందుకు ఎంత మూల్యాన్నయినా చెల్లించగలడు!

ఆ విషయం అటో యిటో తేలిపోవాలీ అంటే ఆ పార్కులోనే మరో చెట్టుక్రింద నేను తిష్ట వేయక తప్పదు!

వెంటనే స్కూటర్‌ను బయటకు తీశాను.

పార్కు బయట స్కూటరాపి వాళ్ళు కూర్చున్న ప్రదేశానికి వెనగ్గా, తెచ్చుకున్న పుస్తకాన్ని తెరిచి, అది చదవటానికి కూర్చున్నట్లుగా కూర్చొని వాళ్ళనే చూస్తున్నాను.

చిన్నగా మాట్లాడుకుంటున్నారు వాళ్ళు-తమ మాటలు ఎవ్వరూ వినగూడదన్నట్లుగా!

నాకు విసుగు పుడుతున్నా కూర్పోక తప్పలేదు. అలాగే బిగుసుకొని-వెనకగా కూర్చున్న నాకు ఆమె మొఖం ఏం కనబడుతుంది గనుక-ముందుకు వెళ్ళి ఎదురుగ్గా కూర్చోవటానికి ధైర్యం చాలటం లేదు!

వాడు ఏ రౌడీగాడో అయితే నన్ను ఏదో వంకన ఉతికినా ఉతకవచ్చు!

సరిగ్గా గంటకు నా అసహనానికి కత్తెర్లు వేస్తున్నట్లుగా ఇద్దరూ లేచి నిలబడ్డారు. అప్పటికే పార్కులో దీపాలు వెలిగి అరగంట అయింది.

విడిపోయేటందుకు రెడీ అవుతున్నట్లుగా చేయి చేయి కలుపుకున్నారు. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసుకుంటూ హాయిగా నవ్వుకున్నారు.

నేను లేవకుండా అక్కడే కూర్చున్నాను, వాళ్ళు నా ముందు నుంచి గేటువైపునకు వెళ్ళేటంత వరకూ-వాళ్ళ చేష్టలను ఈర్ష్యగా చూస్తూ.

వాళ్ళు నన్ను దాటి పదడుగులు ముందుకు వేసిన తరువాత నేనూ లేచి పుస్తకాన్ని మడిచి చేత్తో పట్టుకొని చిన్నగా అడుగులు వేయసాగాను వాళ్ళ వెనగ్గా.

ఇద్దరూ పార్కు గేటు దాటారు. అతడు గేటు పక్కగా, వెలుగుతున్న కార్పొరేషన్ దీపం క్రిందగా నిలబెట్టి వున్న పాత డొక్కు విక్కీని స్టాండు తీశాడు. ఆమె అతడి పక్కగా-రేపు సాయంత్రం వరకూ కనబడడు గదా అన్నంత ఆబగా ఆనుకొని నిలబడింది.

అంత ధైర్యంగా నడిరోడ్డు మీద కూడా అతడి పక్కనే నిలబడిందీ అంటే-ఆమె ఎవ్వరికీ వెరిచే మనిషి కాదని అర్థమవుతున్నది!

కానీ ఆ ఆలోచనకు నా మనస్సు చివుక్కుమన్నది. అంత అందమైన అమ్మాయిని బజారు మనిషిగా ఊహించుకోవడం చాలా చికాకు కలిగిస్తోంది.

ఛ! ఛ! అలా అవ్వగూడదు.

అతడు విక్కీని స్టార్టు చేశాడు. పాతడబ్బాలో రాళ్ళు వేసి గలగలలాడించినట్లు మ్రోతచేస్తూ స్టార్టయింది అది. అతడి భుజం మీద చేయి వేసి అతడిని ఆనుకొని ఆ అందాల భరిణ కూడా దానిమీదే కూర్చున్నది!

హేలగా నవ్వుకున్నాను నేను. నా స్కూటర్ని స్టార్టు చేశాను. నేను ఎప్పుడూ వెళ్ళే స్పీడులో సగం వెళ్ళినా ఆ విక్కీని ఒక నిముషంలో దాటి వేయగలను. అందుకే అతి చిన్నగా అప్పుడే స్కూటరు నడపటం నేర్చుకుంటున్న వాడిలా ఆ అమ్మాయినే చూస్తూ ముందుకు వెళుతున్నాను చీకటిని దీపాలకాంతితో చీల్చుకుంటూ.

నా జీవితంలో నేను ఓ అమ్మాయి వెంట పడటం ఇదే ప్రథమం. నాకు నవ్వు వస్తోంది..భయమేస్తోంది. ఎవ్వరైనా గమనిస్తే అసహ్యంగా వుంటుందనిపిస్తోంది.

-కానీ ఇనుపముక్కను సూదంటురాయి ఆకర్షించినట్లుగా ఆ అమ్మాయి నన్ను అతిబలంగా ఆకర్షిస్తున్నది-నన్ను అశక్తుడిని చేస్తూ!

నా స్కూటరుకు ముందుగా పది గజాల దూరంలో పొగలు గ్రక్కుతున్న ఆ డుక్ డుక్..

అమీర్‌పేట చౌరస్తా బారెడు దూరంలో వున్నదనగా ఆ డొక్కు విక్కీ ఆగింది. వెనుకగా కూర్చున్న ఆ మెరుపు ఎంతో ఎత్తు నుంచి దిగుతున్నట్లుగా ఎగిరి దిగింది. అతడు వెళుతున్నట్లుగా తల ఊపాడు. ఆమె అతడికి దూరమయిపోతున్నట్లుగా తలను దిగులుగా బరువుగా ఊపింది.

నేను ఏదో పనివున్నవాడిలా స్కూటరును వాళ్ళకు చాలా దగ్గరిగా ఆపి వాళ్ళనే చూస్తున్నాను.

మహాపతివ్రతలా భుజం నిండా చీరెకప్పుకున్న ఆమె తలెత్తి-అతడు వెళుతుంటే చేయి ఊపింది.

నాకు సంపూర్ణంగా అర్థమయింది-ఆమె జాణ!

కాని అర్థంకానిదల్లా- ఆమె అందానికి-ఆమె తలుచుకుంటే కార్లలో తిప్పేవాళ్ళే దొరుకుతారు-ఎందుకొచ్చిన ఈ డుకడుక్ పాతడొక్కు విక్కీ, ఖర్మ!

-ప్రేమ గుడ్డిదంటారు..అందుకే కాబోలు!

ఆమె ఎటు పోతుందా అన్నట్లుగా ఇంజను ఆపకుండా స్కూటరు మీదే కూర్చొని ఆమెనే చూస్తున్నాను.

ఆమె ఒక్కసారి రోడ్డుమీద నడుస్తున్న వాహనాల వంక అటూ యిటూ చూసి-రోడ్డు దాటి..ఎల్లారెడ్డిగూడా వెళ్ళే సందులోకి తిరిగింది.

నేనూ స్కూటరు ముందుకు పోనిచ్చి అటు తిరిగేటంతలో ట్రాఫిక్ సిగ్నల్ ఎర్రబడి నాకు అడ్డుగా నిలబడింది. ఒక్క నిముషం ఆగి, మరల పచ్చదీపం వెలగ్గానే నా స్కూటర్‌ను ఆ రోడ్‌లోకి పోనిచ్చాను. ఆమెను దాటి ముందుకు వెళ్ళి రోడ్డు మలుపులో వెనక్కు తిరిగి ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుగా ఆగాను.

లిఫ్ట్ కావాలేమో అడుగుదామా అని ఒక్కక్షణం అనిపించినా-ధైర్యం చాల్లేదు. ఆమెను గురించి పూర్తిగా తెలుసుకోకుండా తొందరపడటం మంచిది కాదేమోనని పించింది!

ఆమె నన్ను దాటి ముందుకు వెళ్ళి కుడివైపునకు మలుపు తిరిగింది..అంటే అది నా మిత్రుడు చంద్రశేఖరం వుండే వీధే.

నేను క్షణం కూడా ఆలస్యం చేయలేదు. నేను స్కూటర్‌ను ముందుకు దూకించి వెళ్ళి వాడి ఇంటి ముందు ఆగాను. ఆ వీధిలో వాడిల్లు తరువాత రెండే ఇళ్ళు వున్నాయి. ఆపైన డెడ్ ఎండ్!

ఆమె నేను నిల్చున్న వైపుకే వస్తున్నది ఆశ్చర్యపోయేలా-చంద్రశేఖరం ఇంట్లోకే వెళ్ళదుగదా!

ఊహూ..సరిగ్గా వాడి ఎదురింట్లోకి-గేటు నెట్టుకుంటూ వెళ్ళిపోయింది వడివడిగా ఆ వీధినంతా చీకటి చేసేసి.

అంటే-ఈవిడగారి గతమూ, వర్తమానమూ అంతా నాకు మావాడు పూసగుచ్చినట్లు చెప్పేయగలడు అన్న మాట!- ఏదో విజయం సాధించినట్లుగా ముందుకు దూకాను.

వాడి ఇంటిగేటు తీస్తున్నానో లేదో, వాడే బయటకు వస్తూ నన్ను చూస్తూనే సంతోషంగా ''హాయ్'' అన్నాడు. ''ఏమిటీ అనుకోని రాక!''

''చాలా రోజులయిందిగదా చూచి..కాలక్షేపానికి బయల్దేరాను!'' సర్వాబద్ధమయినా అతికినట్లు చెప్పక తప్పదు.



చంద్రశేఖరం భార్య నన్ను చూస్తూనే మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది. ''ఇన్నాళ్ళూ కనబడకపోతే ఇక పెళ్ళి లేఖలతోనే వస్తావని అనుకుంటున్నాను'' అన్నది నవ్వుతూ. ఆమె మాకు బంధువు గూడా.

సుజాత లోపలకు వెళ్ళిన తరువాత రెండు నిముషాలు పిచ్చాపాటి మాట్లాడి ''మొత్తానికి నీ యింటి చుట్టూ బృందావనాన్నే ఏర్పరచుకున్నావన్నమాట!'' అన్నాను పెద్దగా నవ్వుతూ.

చంద్రశేఖరం అర్థంగానట్లుగా మొఖం పెట్టాడు. ''ఏమిటి విషయం?''

''మీ ఎదురిల్లు గోపికానిలయమా?''

చాలామంది ఆడపిల్లలున్న మాట వాస్తవమేగా? - వాళ్ళకూ కధలున్నయ్యనే విషయం ఇప్పుడు నువ్వు అనేటంతవరకూ నాకు తెలియదు!'' అన్నాడు కాస్త ఇబ్బందిగా అటూ యిటూ కదులుతూ. ''నీకెందుకొచ్చిందీ అనుమానం?''

''కళ్ళతో చూచాను కాబట్టి!''

''ఆ యింట్లో అమ్మాయినేనా?'' ఒత్తిపలుకుతూ, ముందుకు వంగి, ఆత్రంగా అడిగాడు వాడు.

''అవును!'' అన్నాను కాస్త ఎగతాళిగా.

చంద్రశేఖరం లేచి కిటికీ దగ్గర నిలబడి ఎదురుగ్గా వున్న ఆ యింటి వంకే చూస్తూ చిన్నగా నసుగుతున్నాడు. ''నువ్వేదో అపోహపడివుంటావ్..ఆ యింట్లో వాళ్ళంతా చాలా మంచివాళ్ళు..గౌరవనీయులు..నలుగురూ ఆడపిల్లలు..అందులో ముగ్గురు పెళ్ళి కావాల్సిన వాళ్ళు గూడా..వాళ్ళ గురించి నేనింతవరకూ ఒక్క చెడు మాట గూడా వినలేదే!''

''దెన్ ఫర్‌గెటిట్..నా ఊహ తప్పయి వుంటుంది!''

చంద్రశేఖరం భృకుటి ముడిచి, ''మా ఎదురింట్లో

**పి.ఎస్.నారాయణ**

అన్నాను. ఆ విషయం సాగదీయటం యిష్టం లేదన్నట్టుగా.

అయినా ఏదో సరదాపడి ఇంతదూరం వచ్చాను గాని-చెడిపోయిన ఆడవాళ్ళతో నాకేమిటి పని!..రేపు నేనేదో అమ్మాయిలవెంట పడి తిరుగుతున్నానని వాడు అనుకోవటమూ నాకిష్టం లేదు..అలా అనుకోవటం నాకు అప్రతిష్టగూడా!

కానీ చంద్రశేఖరం నన్నొదల్లేదు. ''నీకెందుకొచ్చిందీ అనుమానం?'' అన్నాడు.

''వదిలేయమన్నాను గదా!''

''అలా వదిలేసే విషయం కాదు అది! వాళ్ళమీద చాలా మంచి అభిప్రాయం వుండటంతో మా పెద్దబావ మరిదికి వాళ్ళ పెద్దమ్మాయితో పెళ్ళి నిశ్చయం చేసుకోబోతున్నాం!'' అన్నాడు వాడు చాలా సీరియస్‌గా మొఖం పెట్టి.

నేను ఆ మాట వింటూనే ఉలిక్కిపడ్డాను.

ఛ! నేను అనవసరంగా ఈరోజు పాడు పని చేశాను. తెలిసీ తెలియని ఆలోచనలతో ఓ అడుసులో కాలుపెట్టాను. ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా కడిగేసుకోవాలి!

''నేను చెప్పానుగదా..నేనే పొరబాటు పడివుండవచ్చుని!''

''అలాకాదు! వాడు నన్ను వదిలేలా లేడు. మన పిల్లవాడికి ఆ యింటి అమ్మాయిని భార్యగా తెచ్చుకుంటున్నప్పుడు వాళ్ళ వెనక ముందులు అన్నీ మనం చూచుకోవటంలో తప్పులేదు..అఫ్‌కోర్స్..మేం ఇంకా మా నిర్ణయాన్ని చెప్పలేదనుకో!''

నేను అసహనంగా లేచాను. కిటికీ దగ్గర నిలబడి ఆ యింటి వంకే చూస్తున్నాను.

సుజాత కాఫీలు తెచ్చింది.

ముగ్గురం కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు త్రాగాం. సుజాత పుట్టింటివాళ్ళు దిల్‌సుఖ్‌నగర్‌లో వుంటారు. ఆమెకు ఇద్దరు అన్నయ్యలు. సుజాత పెళ్ళి కోసమే ఇన్నాళ్ళు వాళ్ళు ఆగింది.

పావుగంట తరువాత నేను లేచాను, ''ఇక వెళ్తాను!'' అంటూ.

''పద సెంటర్ దాకా వస్తాను!'' అంటూ చంద్రశేఖరం గుడ్డలు మార్చుకున్నాడు.

-నాకు స్పష్టంగా అర్థమయింది వాడు సెంటర్‌దాకా నాతో ఎందుకు వస్తానన్నది-నేను వాళ్ళ ఎదురింట్లో వున్న అమ్మాయి గురించి అన్న విషయాన్ని ఇక వాడు చిత్రిక పట్టకుండా ఊరుకోడు!

చేసేదేమున్నది-వాడిని రావొద్దురా అని నేను అనలేను గదా!

ముగ్గురం బయటకు వచ్చాం. అప్పుడే సరిగ్గా ఎదురుగ్గా గేటులో అందాల బొమ్మ నిలబడి, ''మీరొకసారి మా యింటికి రావాలి!'' అన్నది సుజాతను చూస్తూ.

సుజాత 'అలాగే' నన్నట్లుగా తల ఊపింది.

నేను స్కూటరు స్టార్టు చేసిం తరువాత వాడు వెనకాల ఎక్కాడు. సుజాత వైపు తిరిగి వెళుతున్నట్లుగా తల ఊపి, స్కూటర్ను ముందుకు దూకించాను.

నాలుగిళ్ళు దాటిం తరువాత నా భుజం మీద చేయి వేస్తూ, ''ఇప్పుడు చెప్పు వాళ్ళ సంగతి వివరంగా!'' అన్నాడు.

''నువ్వింకా ఆ విషయాన్ని వదిలిపెట్టలేదన్న మాట!''

''నేను చెప్పానుగదా..సుజాత తమ్ముడికి ఆ యింట్లో అమ్మాయిని చేసుకుంటున్నప్పుడు అన్ని విషయాలూ పరిశీలించకుండా ఎలా వదిలేస్తాం..అందునా అనుమానం వచ్చిన తరువాత!''

-నన్ను నేను చాలా ఇరకాటంలో పడేసుకున్నాను. ఆ సాయంత్రం అక్కడకు వచ్చి..వాడు ఎలాగూ ఇక నన్ను వదిలిపెట్టడు..అటువంటప్పుడు నాన్చటం..సాగదీయడం దేనికి?

''ఇప్పుడు ఆ గేటు దగ్గర కనబడ్డ అమ్మాయే ఓ అబ్బాయితో పార్కుల వెంట తిరుగుతుండగా అనుమానమొచ్చి అడిగాను!''

చంద్రశేఖరం నా వీపు మీద ఒక్క చరుపు చరిచాడు. ''బండి ఆపు!'' అన్నాడు అరుస్తున్నట్లుగా.

నేను చటుక్కున స్కూటర్‌ను రోడ్డు పక్కకు తీసి ఆ రోడ్డు మలుపులోనే ఆపేశాను.

'' ఆ అమ్మాయికి పెళ్ళయింది..జానకి ఆ యింటి కోడలు!''

''పెళ్ళయితే పార్కుల వెంట తిరగ్గూడదని వున్నదా?'' నేను విచిత్రంగా వాడిని చూస్తూ అన్నాను.

''ఊహూ..'' వాడు మొఖాన్ని కందగడ్డలా చేసుకుని, పెదాలు బిగించి తల అడ్డంగా తిప్పాడు. ''బహుశా ఆమె భర్తతోనే చూసి వుంటావ్!''

నేనూ అంతకంటే మొండిగా అన్నాను. ''కాదు..వాళ్ళు రోజూ ఆ పార్కులో కలుస్తుంటారు..ఈవిడగారిని ఆ చౌరస్తాలో వదిలేసి అతడి దారిన అతడు వెళ్ళిపోయాడు!''

చంద్రశేఖరం నా మాటలను ఏమాత్రం నమ్మలేకపోతున్నాడు. కానీ-నాకు అబద్ధమాడవలసిన అవసరం లేదని వాడికీ తెలుసు గనుక-ఏం మాట్లాడాలో తెలియక తికమకపడుతున్నాడు!

చాలా లోగొంతుకతో నసుగుతున్నట్లుగా చెప్పటం మొదలుపెట్టాడు. ''నాకు తెలిసినంత వరకూ ఆ అమ్మాయి చాలా బుద్ధిమంతురాలు..అతడు బీదవాడయినా..ముగ్గురు చెల్లెళ్ళకు పెళ్ళి చేయాల్సిన బాధ్యత నెత్తిన ఉన్నవాడే అని తెలిసినా..అతడిని కావాలని ప్రేమించి పెళ్ళి చేసుకున్నది!'' అతడికి నా మాటలు ఏమాత్రం రుచించ లేదనే విషయం నాకు అవగతమవుతూనే వున్నది. ''చిన్న చిన్న ఉద్యోగాలు..ఆఫీసు అయిపోయిం తరువాత అతడు ఒకటీ రెండు ట్యూషన్‌లు గూడా చెప్పి వస్తుంటాడు..పెద్ద ఇంటికి అద్దె పెట్టలేని స్థితిలో ఆ ఒక్క గదిలోనే అందరూ ముడుచుకు పడుకొని ఏ ఆనందాన్నీ, సౌఖ్యాన్నీ, స్వేచ్ఛగా పొందలేకపోతున్న ఆ అమ్మాయిని గురించి నేను అలా ఊహించలేకపోతున్నాను!''

''నాకిప్పుడు అర్థమయింది..నా అంచనా తప్పు కాదు...ఆ అమ్మాయి అందుకే బయట ఆనందంకోసం ఆరాటపడుతున్నదన్నమాట!''

నా కంఠంలోని వ్యంగ్యాన్ని గుర్తించినట్లుగా వాడి మొఖం నల్లబడిపోయింది. మాటలు రాని వాడిలా నిలబడిపోయాడు.

''ఆ అమ్మాయి సామాన్యురాలు కాదు!'' మరోసారి వత్తిపలుకుతూ అన్నాను.

సరిగ్గా ఆ సమయంలోనే మా పక్కన ఓ రిక్షా ఆగింది. 'డుక్ డుక్' మంటూ. చటుక్కున తలెత్తాను..అతడే! నా గుండె గుభేలుమన్నది అతడిని చూస్తుంటే!

''ఇంటికేనా..వెళ్దాం రండి!'' చంద్రశేఖరంతో అంటున్నాడు.

''ఇతడు నా ఫ్రెండ్ సూర్యం..రెండు నిముషాలు మాట్లాడి వస్తాను..మీరు వెళ్ళండి!'' అన్నాడు నన్ను పరిచయం చేస్తూ.

అతడు నా వైపు చూస్తూ నవ్వి, చేయి కలిపి వెళ్ళిపోయాడు.

''ఇతడే జానకి భర్త!'' అన్నాడు వెళ్ళిపోతున్న అతడివంక జాలిగా చూస్తున్నట్లుగా చూస్తూ.

వాడి మాట వింటూనే నా నెత్తిన ఎవ్వరో బాదినట్లనిపించింది. గిల గిల లాడిపోయాను.

''ఇతడు ఆమె భర్తా!'' అన్నాను. తరువాత నాకు మరోమాట నోటపెగల్లేదు. ''సారీ..సారీ'' అన్నట్లుగా పెదాలు మాత్రం వణుకుతున్నాయి.

నాకిప్పుడు అసలు విషయం అర్థమయింది. ఆమె అతడితో ఒంటరిగా, హాయిగా, ప్రేమగా గడపగలిగేది రోజూ ఆ పార్కులో కూర్చునే గంటే నన్నమాట!

...నా నీచమైన ఊహకు తల సిగ్గుతో వాలిపోతున్నది!

★

